
సాక్షి తూర్పుగోదావరి

సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



రూ.50 వేల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి ఇళ్ల రామ్మోహనరావు, రేఖ దంపతులు (పేరూరు) ఆదివారం రూ.50,116 విరాళం సమర్పించారు.



డెల్టాకు 5,650 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 800, పశ్చిమ డెల్టాకు 3,350 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
42.0°/26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	42.0	26.0
కాకినాడ	40.3	27.2
అమలాపురం	40.0	26.0

న్యూస్‌రీల్

ఏపీ సెట్‌కు 5,452 మంది హాజరు



పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: కళాశాలలు, యూనివర్సిటీల్లో టీచింగ్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్ (ఏపీ సెట్) ఆదివారం ప్రశాంతంగా జరిగింది. రాజమహేంద్రవరం పరిధిలో ఏర్పాటు చేసిన 11 కేంద్రాల్లో 6,854 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయాల్సి ఉండగా, 5,452 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణను ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య కె.పద్మరాజు పరిశీలించారు. గైట్ ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాల్లో 900 మందికి గాను 724 మంది పరీక్ష రాశారని చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.జయానంద్‌కుమార్ తెలిపారు.

1న పెన్షన్ల చెల్లింపునకు ఏర్పాట్లు

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీకి విస్తృత ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. పింఛన్ల పంపిణీపై పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ విజయవాడ నుంచి ఆదివారం కలెక్టర్లు, డీఆర్‌డీఏ, జీఎస్‌డబ్ల్యూఎస్, బ్యాంకు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ మాధవీలత, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీ మూర్తి, డివిజనల్ అభివృద్ధి అధికారి పి.వీణాదేవి, లీడ్ బ్యాంక్ మేనేజర్ డీవీ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని సుమారు 2,42,000 మంది లబ్ధిదారులకు రూ.72 కోట్ల మేర సామాజిక భద్రత పింఛన్లు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆ రోజు సెలవు అయినప్పటికీ చెల్లింపులు జరిగేలా రాష్ట్ర స్థాయి అధికారులు, బ్యాంకర్ల కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ నెల 30న నగదు ఉపసంహరించుకునేందుకు బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేశారన్నారు. వచ్చే నెల 1, 2 తేదీల్లో సచివాలయ సిబ్బంది ద్వారా దివ్యాంగులు, అనారోగ్యంతో మంచం పట్టిన వారు, సైనిక కుటుంబాలు తదితర ప్రత్యేక కేటగిరీల వారికి ఇంటి వద్దనే పింఛన్లు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మిగిలిన వారి బ్యాంకు ఖాతాలకు ఒకటో తేదీన జమ చేస్తామన్నారు. సాంకేతిక కారణాలతో బ్యాంకు ఖాతాలకు పెన్షన్ సొమ్ము జమ కాని వారికి ఇంటి వద్దనే సచివాలయ సిబ్బంది వచ్చే నెల 3 నుంచి 5వ తేదీ వరకూ చెల్లింపులు జరుపుతారని మాధవీలత తెలిపారు. పెన్షన్ల కోసం ఎవ్వరూ సచివాలయాలకు రావద్దని తెలిపారు. ఈ మేరకు నగర పాలక సంస్థ, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, డివిజనల్ అభివృద్ధి అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దీనిపై క్షేత్ర స్థాయిలో టాంటాం ద్వారా ప్రచారం చేయాలని సూచించారు.

కోటసత్తెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో వేంచేసియున్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రానికి జవ్వాది రామారావు, సత్యవతి దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు 100 లీటర్ల పెరుగు అందజేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టికెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా అమ్మవారికి రూ.1,38,478 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్ తెలిపారు.

లోవలో భక్తుల సందడి



నూతన ఆలయంలో భక్తుల సందడి

తుని రూరల్: నూతనంగా పునర్నిర్మించిన తలుపులమ్మ అమ్మవారి ప్రధాన ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చిన 5 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నారని కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,09,065, పూజా టికెట్లకు రూ.85, 580, కేశఖండన శాలకు రూ.12,024, వాహన పూజలకు రూ.6,150, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలుగా రూ.48,796, విరాళాలు రూ.12,024 వెరసి మొత్తం రూ.2,76,855 ఆదాయం సమకూరిందని వివరించారు.

జననేత సమర శంఖారావం



- అంబాజీపేటలో నేడు సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభ
- మేనిఫెస్టో విడుదల చేశాక కోనసీమలో తొలిసారి పర్యటన
- ఉమ్మడి జిల్లాలో తొలి ఎన్నికల సభ
- పూర్తయిన ఏర్పాట్లు

సీఎం పర్యటన ఇలా..

- ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 1.10 గంటలకు అంబాజీపేట చేరుకుంటారు.
- అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో హెలికాప్టర్ దిగి, అక్కడి నుంచి బస్సు యాత్రగా స్థానిక మూడు రోడ్ల సెంటర్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.
- 1.20 గంటలకు సభా ప్రాంతానికి చేరుకుంటారు.
- 1.30 నుంచి 2.15 గంటల వరకూ సభలో పాల్గొంటారు.
- 2.20 గంటలకు జెడ్పీ హైస్కూల్‌లోని హెలిప్యాడ్‌కు వెళ్తారు.
- అక్కడి నుంచి 2.30 గంటలకు హెలికాప్టర్‌లో పామర్రు బయలుదేరుతారు.

సాక్షి ప్రతినిధి, కాకినాడ: సంక్షేమ పథకాలతో పేదల తలరాతలు మార్చి.. నవరత్నాలతో అందరి జీవితాల్లో వెలుగులు నింపి.. కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టించి.. దేశ చరిత్రలోనే సువర్ణాధ్యాయాన్ని లిఖించి.. తాజాగా నవరత్నాల ప్లస్ మేనిఫెస్టో విడుదల చేసి.. అందరి హర్షధ్వానాలూ అందుకున్న ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో సోమవారం ఎన్నికల సమరశంఖం పూరించనున్నారు. పి.గన్నవరం నియోజకవర్గంలోని మండల కేంద్రమైన అంబాజీపేట మూడు రోడ్ల జంక్షన్‌లో జరిగే ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొని, అశేష జనవాహినిని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారు. గత ఎన్నికల వేళ ఇచ్చిన హామీల్లో 99 శాతం పైగా అమలు చేసి, అనుక్షణం ప్రజా సంక్షేమాన్ని శ్వాసించి.. మాట ఇస్తే తప్పరనే విధంగా జన విశ్వాసం పొంది.. దేశంలో ఏ ఒక్కరూ అడగని రీతిలో.. మంచి చేసి ఉంటేనే తనకు ఓటు వేయాలని ధైర్యంగా అడుగుతున్న



సభా ప్రాంతాన్ని పరిశీలించేందుకు వచ్చిన పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు తదితరులు

సీఎం జగన్‌కు అఖండ స్వాగతం పలికేందుకు.. ఆయన సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు, ప్రజలు ఉవ్విళ్లూరుతున్నారు. ఈ సభకు పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు ఆధ్వర్యాన విస్తృత ఏర్పాట్లు చేశారు.

బస్సు యాత్రకు నీరా'జనం'

మొదటి నుంచీ సీఎం జగన్‌కు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అంటే వల్లమాలిన అభిమానం. అందుకు తగినట్టుగానే జిల్లా పర్యటనకు వచ్చిన ప్రతి సందర్భంలోనూ ఆయనకు ఈ ప్రాంత ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. తాజాగా ఈ నెల 18న మేమంతా సిద్ధం బస్సు యాత్ర ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించిన సీఎం జగన్‌కు.. కనీవినీ ఎరుగని స్థాయిలో వచ్చిన జనం.. అడుగడుగునా ఎదురేగి మరీ హారతులు పట్టి, అక్కున చేర్చుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు నుంచి ఈతకోట మీదుగా కొత్తపేట నియోజకవర్గానికి చేరుకున్న ఈ బస్సు యాత్ర రాజమహేంద్రవరం రూరల్, రాజమహేంద్రవరం సిటీ, రాజానగరం, అనపర్తి, పెద్దాపురం, కాకినాడ రూరల్, పిఠాపురం, ప్రత్తిపాడు, తుని తదితర నియోజకవర్గాల మీదుగా సాగింది. కాకినాడ రూరల్ అచ్చంపేట జంక్షన్‌లో నిర్వహించిన బహిరంగ సభలో పార్టీ శ్రేణులకు సీఎం జగన్ దిశా నిర్దేశం చేశారు. ఈ యాత్రలో దారి పొడవునా పెద్ద ఎత్తున మహిళలు ముఖ్యమంత్రి జగన్‌కు హారతులు పట్టి, దిష్టి తీసి అంతా మంచి జరగాలని ఆకాంక్షించారు.

సెంటిమెంట్ రిపీట్

గత సార్వత్రిక ఎన్నికల్లో సెంటిమెంట్‌నే ఈసారి ఎన్నికల్లో కూడా రిపీట్ చేస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో అంబాజీపేటలో ఇదే మూడు రోడ్ల జంక్షన్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. ఆ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధించింది. ఈసారి కూడా అదే సెంటర్‌లో ఎన్నికల ప్రచార సభ ఏర్పాటు చేయడం విశేషం. తద్వారా గత ఎన్నికల్లో సాధించిన ఫలితాలే సెంటిమెంట్‌గా ఈ ఎన్నికల్లో కూడా రిపీట్ అవుతాయని పార్టీ శ్రేణులు అంటున్నాయి.

సభ ఏర్పాట్లు పరిశీలించిన నేతలు

అంబాజీపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభ ఏర్పాట్లను పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు, రాష్ట్ర భూదాన కార్పొరేషన్ చైర్మన్ తాడి విజయ భాస్కరరెడ్డి, రాష్ట్ర పరిశీలకుడు హరిప్రసాద్‌రెడ్డి, కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ సీఎం జగన్ వచ్చి, వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. వీరితో పాటు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను కొత్తపేట డీఎస్పీ కె.వెంకట రమణ, ఆర్‌డీఓ జీవీవీ సత్యనారాయణ, సీఈఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి, డీఎంహెచ్ఓ ఎం.దుర్గారావుదొర, డీసీహెచ్ఎస్ ఎన్‌పీ పద్మశ్రీదేవి పరిశీలించారు. హెలిప్యాడ్ వద్ద ఎటువంటి ఇబ్బందులూ రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. సీఎం కాన్వాయ్ వెళ్లే ప్రధాన రహదారిలో భారీ బందోబస్తు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సభా ప్రాంగణం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వైద్యాధికారి వి.గౌతమికి డీఎంహెచ్ఓ సూచించారు. సీఎం జగన్ సభకు భారీగా జనం వచ్చే అవకాశాలు ఉండటంతో పోలీసు శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కన్వీనర్ మంతెన రవిరాజు, నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, అయినవిల్లి జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకుడు గంధం రవికుమార్, ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సర్వం సిద్ధం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభకు సర్వం సిద్ధం చేశాం. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచే కాకుండా జిల్లా నలుమూలల నుంచీ అశేష జనం ఈ సభకు తరలి రానున్నారు. సభకు వచ్చే వారికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సహకరించాలి. ఎన్నికల పర్వం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా జిల్లాకు వస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు, పార్టీ అభిమానులు, శ్రేణులు భారీగా స్వాగతం పలకాలి. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేసిన జగన్‌ను మళ్లీ గెలిపించాలి. వైఎస్సార్ సీపీ ఎన్నికల మేనిఫెస్టో జనరంజకంగా ఉందని అన్ని వర్గాలూ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి. 2014లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 600కు పైగా హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసగించింది. దీనికి భిన్నంగా గత ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడంతో, మాట ఇచ్చారంటే తప్పరని ప్రజలందరూ విశ్వసిస్తున్నారు.

– విప్పర్తి వేణుగోపాలరావు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, పి.గన్నవరం

భారీగా తరలి రావాలి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబాజీపేట సభకు జిల్లాలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు భారీగా తరలిరావాలి. అమలాపురం లోక్‌సభతో పాటు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పార్టీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ సీఎం జగన్ ఈ ఎన్నికల ప్రచార సభకు వస్తున్నారు. ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు అందరూ రావాలి.

– పినిపే విశ్వరూప్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి

– అంబాజీపేట/పి.గన్నవరం/అమలాపురం టౌన్

హమ్మయ్యా..!

- నామినేషన్ల పరిశీలన ప్రక్రియలో గట్టెక్కిన అభ్యర్థులు
- జిల్లావ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీకి 133 నామినేషన్లు
- ఆమోదం 89.. 44 తిరస్కరణ
- నేడు ఉపసంహరణ
- తేలనున్న అభ్యర్థుల తుది జాబితా

సాక్షి, రాజమహేంద్రవరం: సార్వత్రిక సమరంలో అభ్యర్థుల నామినేషన్ల దాఖలు, స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియలు అత్యంత కీలకం. ఇప్పటికే నామినేషన్ల దాఖలు, పరిశీలన ప్రక్రియలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఎంపీ, ఎమ్మెల్యే స్థానాలకు వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వాటి పరిశీలన ఇప్పటికే ముగిసింది. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్లకు ఎన్నికల అధికారులు ఆమోదం తెలిపారు. దీంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా వ్యాప్తంగా రాజమండ్రి లోక్‌సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈ నెల 18న నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. 25వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరించారు. 26న పరిశీలన చేపట్టారు. వీటిలో అన్నీ సక్రమంగా ఉన్న వాటికి ఆయా నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఆమోదం తెలిపారు. మిగిలిన వాటిని తిరస్కరించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 133 నామినేషన్లు దాఖలు కాగా 89 స్వీకరించారు. 44 తిరస్కరించారు. ఆమోదం పొందిన 89 నామినేషన్లకు సంబంధించి సోమవారం ఉపసంహరణ ప్రక్రియ చేపడతారు.

నియోజకవర్గాల వారీగా స్వీకరించిన, తిరస్కరించిన నామినేషన్లు

నియోజకవర్గం	నామినేషన్లు వేసిన వారు	స్వీకరణ	తిరస్కరణ
రాజమండ్రి లోక్‌సభ	19	12	7
అనపర్తి అసెంబ్లీ	24	9	15
రాజానగరం	18	14	4
రాజమండ్రి సిటీ	13	11	2
రాజమండ్రి రూరల్	14	7	7
కొవ్వూరు	14	12	2
నిడదవోలు	16	13	3
గోపాలపురం	15	11	4

ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థితో పాటు, ఆయన భార్య, బంధువులు మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఒకవేళ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ గురైతే ఆదుకునేందుకు ముందు జాగ్రత్తగా ఈవిధంగా చేస్తారు.

ప్రధాన అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందడంతో వారి బంధువులు తమ నామినేషన్లను నేడు ఉపసంహరించుకుంటారు. దీంతో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి నామినేషన్లు మాత్రమే మిగులుతాయి. అనంతరం బరిలో నిలిచే అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేస్తారు. వీరు వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో తలపడతారు.

హోం ఓటింగ్‌కు 1,306 మంది దరఖాస్తు

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలనే లక్ష్యంతో 85 ఏళ్లు నిండిన వృద్ధులకు, దివ్యాంగులకు వారి ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం (హోం ఓటింగ్) కల్పించిన విషయం తెలిసిందే. దీనికి జిల్లా వ్యాప్తంగా 1,306 మంది దరఖాస్తు చేసుకున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 85 ఏళ్లు నిండిన ఓటర్లు 8,294 మంది, 40 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగ ఓటర్లు 19,754 మంది ఉన్నారని తెలిపారు. వారికి ఫామ్–12డి పంపిణీ చేశామన్నారు. 85+ కేటగిరీలో 648 మంది, దివ్యాంగుల కేటగిరీలో 658 మంది ఫామ్–12డి అందజేశారని పేర్కొన్నారు. వీరికి హోం ఓటింగ్ సౌకర్యం కల్పించేందుకు 400 మంది ఎన్నికల సిబ్బందితో కూడిన 69 బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. వీరు 69 రూట్లలో ఆయా నియోజకవర్గాల్లో వచ్చే నెల 2, 8 తేదీల్లో రెండు విడతలుగా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తారని పేర్కొన్నారు. ఆ మేరకు ఆయా ఓటర్లకు ముందస్తుగా సమాచారం ఇవ్వనున్నామని, వారు ఆ రోజుల్లో కచ్చితంగా ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ మాధవీలత తెలిపారు.

కేటగిరీల వారీగా హోం ఓటింగ్‌కు 12డి దరఖాస్తు చేసిన ఓటర్లు, హోం ఓటింగ్ బృందాల వివరాలు

నియోజకవర్గం	85+ వయస్కులు	దివ్యాంగులు	బృందాలు	సిబ్బంది
అనపర్తి	186	222	21	147
రాజానగరం	33	67	7	35
రాజమండ్రి సిటీ	142	65	10	40
రాజమండ్రి రూరల్	51	56	5	30
కొవ్వూరు	66	66	8	40
నిడదవోలు	130	145	12	72
గోపాలపురం	40	37	6	36



కలెక్టర్ మాధవీలత

అనుమతులు, ఫిర్యాదులపై తక్షణ చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న కమల్‌కాంత్ సరోఛ్

రాజమహేంద్రవరం రూరల్: సువిధ ఎన్‌కోర్ అనుమతులు, సీ–విజిల్ ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు కమల్‌కాంత్ సరోఛ్ అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎన్‌కోర్, సీ–విజిల్ విభాగాల నిర్వహణ తీరును, రికార్డులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకూ సువిధ విభాగం ద్వారా ఇచ్చిన, తిరస్కరించిన అనుమతుల వివరాలు తెలుసుకున్నారు. సీ–విజిల్‌కు వస్తున్న ఫిర్యాదులను సగటున 32 నిముషాల 59 సెకన్లలో పరిష్కరిస్తున్నామని అధికారులు తెలిపారు. సువిధ ద్వారా వివిధ నియోజకవర్గాల నుంచి 968 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 820 అనుమతించగా, 116 తిరస్కరించామని, 32 పరిశీలనలో ఉన్నాయని వివరించారు. తిరస్కరించడానికి కారణాలు తెలియజేశామని చెప్పారు. సింగిల్ విండో విధానంలో ఎప్పటికప్పుడు అనుమతులు జారీ చేస్తున్నామని నోడల్ అధికారి, డ్వామా పీడీ ఎ.ముఖలింగం వివరించారు. అనుమతులను 24 గంటల్లోగా జారీ చేసి, వాటి వివరాలు వ్యయ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలకు తెలియజేస్తున్నామన్నారు. సీ–విజిల్‌కు మొత్తం 608 కాల్స్ రాగా 475 పరిష్కరించామని, 133 కాల్స్ సాధారణ సమాచారానికి చేశారని నోడల్ అధికారులు, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ వైస్ చైర్మన్ బి.బాలస్వామి, మార్కెటింగ్ శాఖ ఏడీ ఎం.సునీల్ వినయ్ తెలిపారు. కోడ్ ఉల్లంఘన కింద వాహనాల దుర్వినియోగం, లౌడ్ స్పీకర్లు, అనధికార సమావేశాలు తదితర అంశాలపై 23 నోటీసులు జారీ చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేశామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.నరసింహులు కూడా పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహునికి బంగారు కిరీటం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారికి నెల్లూరుకు చెందిన ఎవర్మార్క్ న్యూట్రాస్యూటికల్స్ (ఎల్‌ఎల్‌పీ) సంస్థ అధినేతలు ఆదివారం బంగారు కిరీటం సమర్పించారు. రూ.9.70 లక్షల విలువైన ఈ కిరీటాన్ని స్వామివారి ఉత్సవమూర్తికి అలంకరణ నిమిత్తం చేయించినట్లు ఆ సంస్థ అధినేతలు, దాతలు అప్పల రంగనాథం, అప్పల రాజ్‌కుమార్ దంపతులు, అప్పల దిలీప్ చక్రవర్తి దంపతులు తెలిపారు. దీనిని ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు ఇచ్చారు. తొలుత కిరీటానికి అర్చకులు, వేదపండితుల సంప్రోక్షణ అనంతరం విశేష పూజలు చేశారు. తర్వాత ఉత్సవమూర్తికి అలంకరించారు. దాతలకు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ అందజేశారు.



స్వామికి అలంకరించే బంగారు కిరీటాన్ని అసిస్టెంట్ కమిషనర్‌కు ఇస్తున్న దాతలు

సంక్షేమం అమలు శక్తి జగన్‌కే ఉంది



ముద్రగడతో వరుపుల సుబ్బారావు తదితరులు

కిర్లంపూడి: దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేయగలిగే శక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు, ఆ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి ముద్రగడను, యువనాయకుడు గిరిబాబును కిర్లంపూడిలోని వారి నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో వ్యవసాయ రంగానికి తాను చేసిన కృషి, అక్కడి ప్రజల కోసం చేసిన ఉద్యమాల గురించి ముద్రగడ ఈ సందర్భంగా జ్ఞాపకం చేసుకున్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు అధికార ఆకలితో బహిరంగ సభల్లో అబద్ధాలు ఆడుతున్నారని అన్నారు. చంద్రబాబు పరిపాలించిన 14 సంవత్సరాల్లో మేలు చేసి ఉంటే 2019లో ప్రజలు ఎందుకు ఓడించారో చెప్పాలని నిలదీశారు. చంద్రబాబు పాలనతో ప్రజలు విసిగిపోయారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లనే పేదలందరూ కడుపు నిండా భోజనం చేయగలుగుతున్నారని, రాష్ట్ర అభివృద్ధితో పాటు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు కావాలంటే ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. అలాగే కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా వరుపుల సుబ్బారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఒక్కో వ్యక్తి 50 ఇళ్లను ఎంచుకుని వైఎస్సార్ సీపీకి ఓటు వేసే విధంగా ప్రచారం చేయాలని, బంధువులు, స్నేహితులకు ఫోన్లు లేదా మెసేజ్‌ల ద్వారా జగన్‌కు ఓటు వేయాల్సిందిగా చెప్పాలని ముద్రగడ సూచించారు. ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ, నియోజకవర్గం నుంచి వచ్చిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని కోరుతూ, తమ విజయానికి కృషి చేస్తున్న ముద్రగడ పద్మనాభానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సలహాలు, సూచనలతో గ్రామాల్లో ప్రచారం ముమ్మరం చేస్తామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తనకు, కాకినాడ ఎంపీ అభ్యర్థి సునీల్‌కు ఓట్లు వేసి గెలిపించి, జగన్‌ను మళ్లీ సీఎంను చేయాలని అభ్యర్థించారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ


నాగబాబు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ముంబయిలోని సౌమ్య విద్యా విహార్ స్పోర్ట్స్ స్టేడియంలో ఈ నెల 26 నుంచి 28 వరకూ జరిగిన జాతీయ స్థాయి 43వ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో జిల్లాకు చెందిన యాతం నాగబాబు పలు పతకాలు సాధించారు. 29 రాష్ట్రాల నుంచి 3,500 క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో 800 మీటర్ల విభాగంలో రజిత, 1600 మీటర్ల రిలేలో బంగారు, 400 మీటర్ల రిలేలో రజిత పతకం సాధించారు. నాగబాబు ప్రస్తుతం కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మలేరియా విభాగంలో సబ్ యూనిట్ అధికారిగా పనిచేస్తున్నారు.

రెజ్లింగ్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక


చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): చిత్తూరు జిల్లాలో మే 3 నుంచి 5 వరకూ జరిగే రాష్ట్ర స్థాయి అండర్–17, 23 రెజ్లింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపికను జిల్లా సంఘం ఆధ్వర్యంలో కాకినాడ డీఎస్ఏలో ఆదివారం నిర్వహించారు. సబ్ జూనియర్స్ విభాగానికి ఎస్.రోషిణి, పి.ఏంజెల్, కె.సత్యభవాని, సీహెచ్ శశిప్రియ, ఆర్.రమణ, సీహెచ్ అమృత వర్షిణి, బి.భారతి, ఎ.అర్చన, ఎ.లక్ష్మిలు ఎంపికయ్యారు. అండర్–23లో ఎ.దినాహ్, ఎస్.రమాదేవి, వై.సత్య, జి.ప్రత్యూష, వి.అరుణ, పి.సురేఖలు, గ్రీస్ బాలుర విభాగంలో యూవీవీ దుర్గాసాయి, బి.దుర్గాప్రసాద్, టి.మణికంఠ, జేఎస్ఎస్ రోహిత్, సీహెచ్ చంద్రశేఖర్, అండర్–23లో పి.సతీష్, గ్రీస్ బాలుర విభాగంలో జేఎస్ఎస్ రోహిత్, చంద్రశేఖర్ ఆడనున్నారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా రెజ్లింగ్ సంఘ అధ్యక్షుడు ఎలీషా, ఒలింపిక్ సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ అభినందించారు.

చల్లని ఉపద్రవం

- నిండు ఆరోగ్యానికి కాలకూటం
- రంగుల ద్రావణాలతో ప్రాణసంకటం
- వేసవిలో యథేచ్ఛగా విక్రయాలు
- హానికారక రంగులు, కల్తీ ఐస్‌తో ముప్పు

కాకినాడ క్రైం: ఎండ మండుతోంది.. బయటకు వెళ్తే గొంతెండుతోంది. అలసి సొలసిన ప్రయాణంలో చల్లని ద్రవాలే కాస్త ఉపశమనం ఇచ్చేది.. ఇదే నిండు ఆరోగ్యానికి కాలకూటం అవుతోంది.. వ్యాపారులు లాభాపేక్షే పరమావధిగా దాహం తీర్చే ద్రవాల్లో అనుమతి లేని రంగులు, నాణ్యత లేని ఐస్ కలిపి ప్రజల ఆరోగ్యానికి చేటు తెస్తున్నారు. ఎండల్లో ఆ కలుషిత పానియాలే తాగి హమ్మయ్య అని సేద తీరుతున్న వారెందరో.. ఈ చల్లని ఉప'ద్రవం' గురించి తెలుసుకుందాం రండి.. వేసవి వేళ హానికరమైన రంగులు, నాణ్యత లేని ఐస్ వ్యాపారాల మాఫియా పురివిప్పుకుంటోంది. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతోంది. ప్రజల్లో అవగాహనా లేమి, ఆయా శాఖల అధికారుల నిర్లక్ష్యం శాపంగా మారుతోంది. ఆరెంజ్, ద్రాక్ష, పైనాపిల్, స్ట్రాబెర్రీ అంటూ పండ్ల పేర్లు పెట్టి, వాటిని కనీస మొత్తంలోనైనా వినియోగించకుండా పూర్తిగా రంగులు, ఫ్లేవర్లను కలిపి పేరు లేని ద్రవాలెన్నో తయారు చేస్తున్నారు. వీటిని వినియోగించడంలో కచ్చితమైన మార్గదర్శకాలున్నా అమలులో మాత్రం ఎటువంటి శ్రద్ధ కానరావడం లేదు.

దిమ్మ తిరిగే నిజం

చల్లని ద్రవాలకు మూలం అందులో వేసే ఐస్. ఈ ఐస్ తయారీ, విక్రయాల్లో ఎన్నో లొసుగులు ఉన్నాయి. వీటిపై అవగాహన లేక ప్రజలు తాము తాగే సోడాలు, చెరుకు రసాల్లో ఈ ఐస్‌ను వినియోగిస్తుంటే చల్లగా గుటకేసేస్తున్నారు. ఐస్ వినియోగంలో తెలుసుకోవాల్సిన అతి ముఖ్య విషయం ఏంటంటే, దిమ్మ నుంచి తీసే ఐస్ అత్యంత ప్రమాదకరం. దీనిని ఇండస్ట్రియల్ ఐస్ అంటారు. ఈ ఐస్ తయారీకి ఎటువంటి నీటినైనా వినియోగించుకునే హక్కు తయారీదారుడికి ఉంది. ఇది పరిశ్రమల వినియోగానికి ఉపయోగిస్తారు. నాణ్యమైన తాగునీటిని వినియోగించాలనే నిబంధన లేదు. అలాగే ఐస్ తయారు చేసే ప్రదేశం పరిశుభ్రత కూడా పరిగణించరు. కాకినాడ నగరంలో కొందరు చెరుకు రసం విక్రయదారులు తమకు సరఫరా చేసిన ఐస్ దిమ్మల్లో చనిపోయిన బొద్దింకలు, ఎలుకలను కూడా చూశామని అంటున్నారు. ద్రవాల్లో వినియోగించేందుకు నిబంధనల ప్రకారం చిన్నపాటి క్యూబ్‌లను వాడాలి. వాటిని తయారీ చేసేందుకు ప్రత్యేక యంత్రం ఉంటుంది. దీని ధర నామమాత్రంగా, యంత్రం చిన్నదిగా ఉంటుంది. చెరుకు రసం, సోడా, జ్యూస్ సెంటర్లు ఈ యంత్రాన్నే వినియోగించి ఐస్ క్యూబ్‌లు తయారు చేసుకోవాలనేది నిబంధన ఉంది. అది చాలాచోట్ల అమలు కావడం లేదు.


చెరుకు రసంలో కలిపేందుకు గ్లాసులో వేసిన ఇండస్ట్రియల్ ఐస్

క్యాన్సర్‌తో పాటు ఎన్నో రోగాలు



కూల్ డ్రింక్‌లు, సోడాలు, మాక్‌టైల్ సహా పలు ద్రావణాలలో ఉపయోగించే రంగులలో ఉండే బెంజైడీన్, 4–ఎమినోబైఫినైల్, 4–ఎమినోఎజోబెంజైన్, టట్రాజెన్ ఎల్లో, మెటానిల్ ఎల్లో, రుడామిన్ బిలు క్యాన్సర్ కారకాలు. ఇవి అత్యంత ప్రమాదకరం. ఈ విషయాన్ని తాజాగా అంతర్జాతీయ అధ్యయనాలు వెల్లడించాయి. వీటివల్ల క్యాన్సర్‌తో పాటు పుట్టుక లోపాలు, చర్మ, జీర్ణాశయ, కాలేయ వ్యాధులు, ఆర్గాన్ డేమేజ్ సంభవిస్తాయి. అందువల్ల ద్రవాల్లో ఎటువంటి రంగులను వినియోగించకపోవడమే మేలు.

–కర్ర ప్రదీప్, క్యాన్సర్ వైద్య నిపుణుడు, జీజీహెచ్ కాకినాడ


కాకినాడలోని ఓ దుకాణంలో సోడాల్లో కలిపేందుకు సిద్ధం చేసిన రంగులు

అనారోగ్యాన్ని కొనితెచ్చుకున్నట్టే



కూలింగ్ లేకపోతే మంచినీరైనా తాగేందుకు కొందరు ఇష్టపడరు. అటువంటి వారు అనారోగ్యాన్ని కొనితెచ్చుకున్నట్లే. నిరంతరం చల్లని నీరు, ద్రవాలు తాగడం వల్ల జీర్ణ సమస్యలు, తలనొప్పి, సైనస్, గుండె వేగం తగ్గిపోవడం, శరీరంలో కొవ్వుశాతం పెరగడం వంటి సమస్యలు తలెత్తవచ్చు. అలాగే రక్తనాళాలు కుచించుకుపోయి, కడుపు ఉబ్బరం, కండరాలు పట్టేయడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఇండస్ట్రియల్ ఐస్‌ను ఎక్కువగా చెరుకు రసాలు, సోడాలలో వాడేస్తున్నారు. ఈ ఐస్ ద్వారా కలుషిత నీటిని తాగితే టైఫాయిడ్, డయేరియా, శ్వాస కోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.

–డాక్టర్ మాతంగి కిరణ్, పల్మనాలజిస్టు

కేసులు నమోదు చేస్తాం..



ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వ్యాపారులను ఉపేక్షించం. అటువంటి వ్యాపారాలు మూసివేయించి, కేసులు నమోదు చేస్తాం. టట్రాజెన్ ఎల్లో, మెటానిల్ ఎల్లో, రుడామిన్ బి సహా హానికారక ఫుడ్ కలర్స్ వాడడం ఏ మాత్రం సరికాదు. బీట్‌రూట్, గులాబీ రెమ్మలు, కాశ్మీర్ చిల్లీస్, సుగంధి నుంచి సేకరించిన సహజ రంగుల వినియోగానికి అనుమతి ఉంది. ఇండస్ట్రియల్ ఐస్‌ను చెరుకు రసాలు, కూల్ డ్రింక్‌లు, సోడాలలో ఉపయోగిస్తామంటే కుదరదు. అటువంటి ఐస్ కొన్నా, అమ్మినా కఠిన చర్యలు తప్పవు. వీటిపై ముమ్మర తనిఖీలు చేపడతాం.

–బి.శ్రీనివాస్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా

రెండు తాటాకిళ్లు దగ్ధం

మామిడికుదురు: పాశర్లపూడి కొట్టుమెరక రోడ్డులో నూకాలమ్మ ఆలయం సమీపంలో ఆదివారం ఉదయం ఓ తాటాకిల్లు దగ్ధమైంది. పాలమూరి వీరరామారావు, సుబ్బారాయుడు కుటుంబాలు సర్వం కోల్పోయాయి. రూ.30 వేల నగదు కాలిపోయిందని, 28 గ్రాముల బంగారం, 15 తులాల వెండి ప్రమాదంలో కరిగిపోయిందని బాధితులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.9 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. పొయ్యి నుంచి రేగిన నిప్పు రవ్వలే ప్రమాదానికి కారణమని చెబుతున్నారు. రాజోలు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బాధితులను సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు పరామర్శించారు.

గోపాలపట్నంలో మరో ఘటన

తొండంగి: గోపాలపట్నం ఎస్సీ పేటలోని నేరేళ్లమ్మ ఆలయ సమీపంలో చలగల సత్తమ్మ ఇంట్లో వంట చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆందోళనకు గురైన ఆమె కేకలు వేస్తూ బయటకు వచ్చేంది. వెంటనే స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అంతలో తుని అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లోని గృహోపకరణాలతో పాటు డ్వాక్రా సొమ్ము రూ.1.50 లక్షలు, బంగారు, వెండి ఆభరణాలు కాలిపోయాయి. సుమారు రూ.4 లక్షల వరకూ ఆస్తి నష్టం జరిగి ఉంటుందని వీఆర్వో సింహాచలం తెలిపారు. ఈ ఘటనను తెలుసుకున్న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా వెంటనే స్పందించి రూ.30 ఆర్థిక సహాయం అందించాలని వైస్ ఎంపీపీ నాగం గంగబాబును ఆదేశించారు. ఈ మేరకు గంగబాబు, గాబు రాజులు బాధితులకు సాయం ఇచ్చారు. సర్పంచ్ కటకం శివ, ఎంపీటీసీ గునిమానికిల ఏసుబాబు, బూత్ కన్వీనర్ యడ్ల వెంకటరమణ బియ్యం, నిత్యావసరాలు అందజేశారు.


గోపాలపట్నంలో దగ్ధమైన పూరిల్లు

సడన్ బ్రేక్... జీవితాలనే మార్చేసింది

- లారీని వెనుక నుంచి ఢీకొన్న వ్యాన్
- ఇద్దరు దుర్మరణం, ఆరుగురికి గాయాలు

కొవ్వూరు: వేగంగా వెళ్తున్న లారీ సడన్‌గా బ్రేక్ వేసి రోడ్డు పక్కకు వెళ్తున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన ఐషర్ వ్యాన్ బలంగా ఢీకొనడంతో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురికి గాయాలయ్యాయి. కాపవరం సమీపంలో నేషనల్ హైవేపై ఫ్లైఓవర్ దిగువన శనివారం తెల్లవారుజామున ఈ ప్రమాదం సంభవించింది. కొవ్వూరు రూరల్ ఎస్సై కె.సుధాకర్, పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు కథనం ప్రకారం.. ఏలూరు నగరానికి చెందిన మేడం వినోద్ (32) సభలకు సౌండ్ సిస్టం ఏర్పాటు చేసే పనిచేస్తుంటాడు. వినోద్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. తన వృత్తిలో భాగంగా గుంటూరులో సభకు సౌండ్ సిస్టం అమర్చిన వినోద్ తిరిగి విశాఖపట్నం సమీపంలోని చోడవరంలో కార్యక్రమానికి సౌండ్ సిస్టంను తీసుకెళ్తున్నారు. ఈ సౌండ్ బాక్స్‌లను తీసుకుని ఏలూరుకు చెందిన మరో ఏడుగురితో చోడవరానికి ఐషర్ వ్యాన్‌లో బయలు దేరారు. ఈ నేపథ్యంలో కొవ్వూరు మండలం కాపవరం సమీపానికి వచ్చేసరికి హైవేపై ఫ్లైఓవర్ దిగువన జగ్గయ్యపేట నుంచి ఒడిశా రాష్ట్రానికి సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో పాటు, ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా రోడ్డు మార్జిన్‌లోకి వెళ్లింది. అప్పటికే వెనుక ఉన్న ఐషర్ వ్యాన్ అదుపు తప్పి వెనుక నుంచి లారీని ఢీకొంది. ఈ ఘటనతో మేడం వినోద్, అతని సహచరుడు దారబోయన ప్రభాకర్ (21) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వ్యాన్‌లో ఉన్న ఏలూరు పట్టణానికి చెందిన మరో ఆరుగురు గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడు ప్రభాకర్‌కు ఇంకా వివాహం కాలేదు.


కాపవరం సమీపంలో ప్రమాదానికి గురైన వాహనాలు, రోడ్డుపై పడి ఉన్న మృతదేహం

అదే కారణం..

ఈ ప్రమాదానికి లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని చెబుతున్నారు. సడన్‌గా బ్రేక్ వేయడం, ఎటువంటి సిగ్నల్ ఇవ్వకపోవడం, రోడ్డు మార్జిన్‌లోకి లారీని ఒక్కసారిగా తిప్పేయడంతో వెనుక వస్తున్న వ్యాన్ అదుపుతప్పి ప్రమాదం జరిగిందని అంటున్నారు. తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనతో హైవేపై ట్రాఫిక్ స్తంభించింది. కొవ్వూరు రూరల్ ఎస్సై కె.సుధాకర్, పట్టణ సీఐ వి.జగదీశ్వరరావులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

పంట పొలం అమ్మబడును

■ కాకినాడ జిల్లా కత్తిపూడి దగ్గరలో 70 సెంట్లు పంట పొలం అమ్మకంనకు కలదు. కొనుటకు ఆసక్తి గల వారు వివరాలకు సంప్ర॥ రాజు ✆ 80080 05242 [O-191534]

RENT

■ Kakinada, Ayodya Nagar Duplex House for Rent Commercial, (Bank / Offices) 4 Rooms + Big Hall + Kitchen, 3100 Sq. Feet Area. ✆ : 98483 50298, 80192 73599 [R-2134]

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2524]

ASTROLOGY

■ శ్రీ భద్రకాళి చౌడేశ్వరి జ్యోతిష్యం: జనవశం, రాజకీయ విజయం, వ్యాపారం, స్త్రీ/పు॥, ప్రేమ, వశీకరణ మరియు మీ ఎటువంటి గుప్త కఠిన వ్యక్తిగత సమస్యలకు 2 రోజుల్లో శాశ్వత పరిష్కారం. సంప్ర: 7702905608. [W-1264937]

Wanted

■ రాజమండ్రి, బొమ్మూరు ప్రాం॥కు, ATMs నందు సెక్యూరిటీ గార్డ్సు, సెు॥సూ॥ కావలెను. జీ॥ 12-15 వేలు రూం+భో & మా సంస్థకు ఫీల్డ్ ఆఫీసర్ కావలెను. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, రాజమండ్రి- ✆: 93922 69369 [R-443]

■ Computer Operator-3 Nos (M/F) Age: 30 below, Location : RJY Morampudi, Timing : 9.30 to 6.00 PM. Qly : Inter to Degree, Sal : 8000 to 9,000. ✆ : 91007 75552 [R-6673]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217 [M-1185052]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్+భోజనం. Hyd. Ph:7995365999 [HA-70]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ:18K. Ph: 9640400073 / 9160900024 [HA-78]

■ అగ్రికల్చర్ ప్రాజెక్ట్ నందు పనిచేయుటకు 10th, ఇంటర్, డిగ్రీ చదివిన వారు కావలెను. జీతం: 15 వేలు నుండి 30 వేలు వరకు సంపాదించుకునే అవకాశం కలదు. సంప్ర:9000501618, 9391835409. [A-784627]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

అంబాజీపేట: అంబాజీపేటలో సోమవారం సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభ నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్‌ను మళ్లించినట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఇది అమలులో ఉంటుందన్నారు. పి.గన్నవరం వైపు నుంచి అమలాపురం వెళ్లే వాహనాలను మాచవరం మీదుగా చిరతపూడి, అవిడి, ముక్కామల వైపు నుంచి అమలాపురానికి వెళ్లాలి. బోడసకుర్రు వైపు నుంచి వచ్చే వాహనాలు బోడసకుర్రు బ్రిడ్జి నుంచి పి.గన్నవరం, కొత్తపేట వైపు వెళ్లే వాహనాలు భేతాళస్వామి గుడి నుంచి మెట్ల కాలనీ మీదుగా మాచవరానికి దారి మళ్లించారు. అమలాపురం నుంచి పి.గన్నవరం వెళ్లే వాహనాలు గంగలకుర్రు మలుపు నుంచి ముక్కామల, అవిడి మీదుగా వెళ్తాయి. కొత్తపేట, అయినవిల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు, అయినవిల్లి, ముక్కామల నుంచి వచ్చే వాహనాలు ముక్కామల అవిడి వైపు నుంచి పి.గన్నవరం మీదుగా వెళ్లాలన్నారు. సభకు రాజోలు, పి.గన్నవరం నుంచి వచ్చేవారు మాచవరం పంచాయతీ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవాలన్నారు. అమలాపురం వైపు నుంచి వచ్చే వాహనాలను గంగలకుర్రు మలుపు వద్ద దొమ్మేటి వెంకట్రావు కొబ్బరి తోటలో నిలుపుకోవాలన్నారు. బోడసకుర్రు వైపు నుంచి వచ్చే వాహనాలను సాయికృష్ణ తల్లి పిల్ల హాస్పిటల్ పక్కన ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవాలన్నారు. కొత్తపేట, అయినవిల్లి వైపు నుంచి వచ్చే వాహనాలను అంబాజీపేట బస్టాండ్ ఎదురుగా లేఅవుట్ వద్ద నిలుపుకోవాలన్నారు.

టైర్ పంక్చర్.. కారు బోల్తా

ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు


మృతి చెందిన సిరిగిరి నరేష్


ప్రమాదానికి గురైన కారు

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరం జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ముగ్గురు గాయాలపాలయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. తెనాలికి చెందిన ఏడుగురు మిత్రులు తమ స్నేహితుడి వివాహానికి కారులో విశాఖపట్నం వెళ్లారు. ఈ వేడుక అనంతరం తిరుగు ప్రయాణంలో అన్నవరం సత్యదేవుని దర్శించుకుని తిరిగి తెనాలికి బయలుదేరారు. మార్గమధ్యంలో ధర్మవరం జాతీయ రహదారిపై స్థానిక కోల్డ్ స్టోరేజ్ వద్ద వారు ప్రయాణిస్తున్న కారు టైరు పంక్చర్ కావడంతో డివైడర్‌ను ఢీకొంది. ఈ నేపథ్యంలో కారు పల్టీలు కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న సిరిగిరి నరేష్ (34) మృతి చెందాడు. తోట చందు, గుడివాడ చైతన్య, బర్ల గోపి (డ్రైవర్) గాయాల పాలయ్యారు. వీరిని చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. కొర్నీడి విజయ్ భాస్కర్, గెద్దం శేషు, రావిపాటి హర్ష సురక్షితంగా బయటపడ్డారు. ప్రత్తిపాడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఎస్సై పవన్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మోటార్ సైకిలిస్ట్‌కు గాయాలు


కారు ఢీకొనడంతో గాయపడిన జగదీష్

సామర్లకోట: స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఒక మోటారు సైకిలిస్టు గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. పిఠాపురం నుంచి వస్తున్న కారు టైరు స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద వచ్చే సరికి పేలిపోయింది. ఈ నేపథ్యంలో కారు అటుగా బైక్‌పై వెళ్తున్న కొట్లమ్మ చెరువు ప్రాంతానికి చెందిన కె.జగదీష్‌ను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేశారు.

కిక్కిరిసిన అయినవిల్లి క్షేత్రం


అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయమే ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి మేలుకొలుపు సేవ జరిగింది. అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పంచామృత, ప్రత్యేక అభిషేకాల్లో 45 మంది, ప్రత్యేక దర్శనంలో 345 మంది, లక్ష్మీ గణపతి హోమంలో 19 మంది పాల్గొని పూజలు చేశారు. 41 మంది నూతన వాహన పూజలు, ఏడుగురు చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసాలు జరిగాయి. ఐదుగురు తలనీలాలు సమర్పించారు. స్వామివారి అన్నదాన పథకంలో 1,612 మంది అన్నప్రసాదం స్వీకరించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాలుగా రూ.1,75,805 ఆదాయం లభించిందని ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ ఫౌండేషన్ అవసరం

తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: పిల్లలు భవిష్యత్తులో ఐఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మకమైన జాతీయ స్థాయి కళాశాలలో విద్యనభ్యసించాలంటే స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ అవసరమని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తల్లిదండ్రులకు సూచించారు. ఆదివారం కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు వేసవి సెలవుల్లో కొంత సమయాన్ని విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు, మరికొంత సమయాన్ని ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ లాంటి వివిధ కళలు అభ్యసించడానికి కేటాయించాలన్నారు. 'ప్రతిరోజు ఒక చేపను పట్టుకొచ్చి పిల్లలకు పెట్టడం కాదు ఆ చేపల్ని ఎలా పట్టాలో నేర్పు' అనే చైనీస్ సామెతలా ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగే విధంగా తయారు చేయాలన్నారు. అప్పుడే వారు ఎంతో ఎత్తుకు వెళ్తారని చెప్పారు. తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినిదేవి మాట్లాడుతూ పిల్లలు తమ తల్లిదండ్రులను అనుకరిస్తారని, తల్లిదండ్రులు వారికి రోల్‌మోడల్‌గా ఉండాలన్నారు. ప్రతి తల్లి తమ పిల్లలను సరైన మార్గంలో పెంచితే సమాజమంతా ఒక కుటుంబంలా కలసిమెలసి ఉంటుందని అన్నారు. ప్రస్తుతం పిల్లలు పుస్తకాల కన్నా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు ఎక్కువగా అలవాటు పడ్డారన్నారు. పుస్తకాలతో కన్నా మొబైల్‌తో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టం గురించి తల్లిదండ్రులు వారికి వివరించాలని తెలిపారు. ఈ సదస్సుకు సుమారు 14 వేల మంది హాజరయ్యారన్నారు. విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులు కె.చలం, జి.వనజ తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన బైక్

ఇద్దరికి గాయాలు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం బీచ్‌రోడ్డులో ఆదివారం కారును బైక్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ వివరాల్లోకి వెళితే.. కాకినాడ వైపు నుంచి ఒంటిమామిడి వైపు వస్తున్న కారును యు.కొత్తపల్లి మండలం మూలపేట ఎస్ఈజెడ్ కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై పెరుమాళ్లపురం నుంచి మూలపేట వెళ్తుండగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వారిద్దరికీ గాయాలయ్యాయి. స్థానికుల 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ పైలెట్ ఎస్.కరుణాసాగర్, ఈఎంటీ ఎం.దేవి అక్కడకు చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి పిఠాపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించారు. దీనిపై తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


పెరుమాళ్లపురం బీచ్‌రోడ్డులో కారును ఢీకొట్టిన బైక్

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

అమలాపురంలో ఘటన


బిల్డింగ్ సీలింగ్ వర్కర్ సుశీల్ ప్రకాష్ మృతదేహం

అమలాపురం టౌన్: ప్రేమ విఫలం కావడంతో ఉత్తరప్రదేశ్ (యూపీ) రాష్ట్రానికి చెందిన బిల్డింగ్ సీలింగ్ వర్కర్ సుశీల్ ప్రకాష్ (20) అమలాపురం పట్టణం శ్రీరామపురంలోని ఓ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ సీఐ కె.క్రిష్టోఫర్ కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్య ప్రాంతానికి చెందిన సుశీల్ ప్రకాష్ 15 మంది వర్కర్లతో కలసి అమలాపురానికి బిల్డింగ్ పనుల నిమిత్తం వచ్చాడు. వీరంతా ఇక్కడి శ్రీరామపురంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. పెళ్లిళ్లు, తదితర శుభ కార్యాలయాలు ఉండడంతో 13 మంది సొంత రాష్ట్రానికి వెళ్లారు. ప్రస్తుతం ఇక్కడ సుశీల్ ప్రకాష్‌తో పాటు మరో వర్కర్ రఘువీర్ ప్రజాపతి ఉంటున్నారు. శనివారం రాత్రి సుశీల్ ప్రకాష్ పక్క గదిలోకి వెళ్లి ఎవరితోనో అదే పనిగా ఫోన్ మాట్లాడాడు. వేరే గదిలో రఘువీర్ ప్రజాపతి పడుకున్నాడు. సుశీల్ ప్రకాష్ ఫోన్‌లో తన ప్రేయసి లేదా తన బంధువులతో గంటల తరబడి మాట్లాడినట్లు అతని ఫోన్ కాల్స్‌ను బట్టి తెలుస్తోంది.

ఘటనా స్థలంతో సుశీల్ ప్రకాష్ తన ఫోన్‌ను నేలకేసి కొట్టడంతో అది పగలిపోవడంతో అతను ప్రేమ వ్యవహారంపై మాట్లాడుతూ ఆవేశానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తన ఫోన్ పగిలిపోయాక పక్క గదిలో నిద్రిస్తున్న రఘువీర్ ప్రజాపతి ఫోన్‌ను సుశీల్ ప్రకాష్ తెచ్చుకుని కొంత సేపు మాట్లాడినట్లు తెలుస్తోంది. తెల్లారేసరికి తన ఫోన్ కనిపించకపోవడంతో రఘువీర్ పక్క గది కిటికీ తలుపులు తెరిచి చూసేసరికి ఫ్యాన్ ఉక్కు సుశీల్ ప్రకాష్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించాడు. పోలీసులు రంగ ప్రవేశం చేసి గది తలుపులు పగులగొట్టి సుశీల్ ప్రకాష్ మృతదేహాన్ని కిందకు దింపారు. పోస్టుమార్టం అయ్యాక అతని మృతదేహాన్ని ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని తన స్వగ్రామానికి తోటి వర్కర్ రఘువీర్ ప్రజాపతి తీసుకు వెళ్లాడు. ఈ మేరకు పట్టణ ఎస్సై చంటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.